వేతన.. వేదన

- ఉపాధి కూలీలకు రెండు నెలలుగా అందని వేతనాలు
- వేతనాలు రాకపోవడంతో పనులకు దూరంగా కూలీలు
- పనుల కల్పనలో వెనకబడటంతో కౌతాళం ఎంపీడీవో, ఏపీవోలకు షోకాజ్ నోటీసులు


సూగూరు గ్రామంలో ఫీడర్ చానెల్ పనుల్లో కూలీలు

మంత్రాలయం : అసలే కరువు ప్రాంతం. వ్యవసాయ పనులు ముగిస్తే ఇక్కడి కూలీలు, సన్న,చిన్న కారు రైతులు పొరుగూళ్లకు వలసబాట పడతారు. ఇక ఊళ్లను అంటిపెట్టుకుని ఉంటున్న పేదలకు మాత్రం ఉపాధి హామీ పనులే శరణ్యం. పూట గడవాలంటే ఉపాధి పనులే దిక్కు. అయితే ఉపాధి కూలీల ఆశలపై కూటమి ప్రభుత్వం మట్టి చల్లింది. వేతనాలు మంజూరు చేయకుండా వారిని ఇబ్బందులకు గురిచేస్తోంది. దీంతో ఉపాధి పనులపైనా కూడా కూలీలు ఆశలు వదులుకునే పరిస్థితి తెచ్చారు. ఒకప్పుడు పనుల్లో వేలల్లో పాల్గొనే కూలీలు నేడు పదుల సంఖ్యకు చేరారు. ఇంతగా గ్రాఫ్ పడిపోవడానికి కారణం వేతనాలు సమయానికి ఇవ్వకపోవడమే.

నియోజకవర్గంలో..

మంత్రాలయం నియోజకవర్గంలో మొత్తం 94 గ్రామ పంచాయతీలుండగా.. మొత్తం 60,212 జాబ్ కార్డులు ఉన్నాయి. అందులో ప్రస్తుతం రోజుకు 11,178 మంది కూలీలు పనులకు హాజరవుతున్నట్లు అధకారుల లెక్క. ఆన్‌లైన్ రిపోర్టు ప్రకారం శుక్రవారం కేవలం 5,921 మంది మాత్రమే హాజరయ్యారు. అంటే సగానికి పైగా కాకి లెక్కలు చూపిస్తున్నట్లు తేటతెల్లమవుతోంది.

పెండింగ్‌లో రూ.4.36 కోట్ల వేతనాలు..

నమ్ముకుని పనులకు వెళితే కూటమి ప్రభుత్వం వేతనాలు ఇవ్వకుండా కూలీల కడుపులు మాడుస్తోంది. ఒక వ్యక్తికి దినసరి కూలి రూ.195 వస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. వాస్తవంగా రోజుకు ఒక వ్యక్తికి రూ.307 కూలి పడేలా అధికారులు పనులు చేయించాల్సి ఉంది. ఇక్కడి అధికారులు మాత్రం ఎవరూ ఆ దిశగా పనులు చేయించక పోవడం విశేషం. ఇక మూడు నెలలుగా వేతనాలు పడటం లేదు. కొన్ని చోట్ల 7 వారాలుగా పెండింగ్‌లో పెట్టారు. నియోజవర్గంలో ఇప్పటి వరకు రూ.4.36 కోట్లు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. మంత్రాలయంలో రూ.1.70 కోట్లు, కోసిగిలో రూ. 60 లక్షలు, పెద్దకడబూరులో రూ.48 లక్షలు, కౌతాళంలో రూ.1.50 కోట్లు వేతనాలు మంజూరు కావాల్సి ఉంది.

అస్తవ్యస్తంగా నిర్వహణ..

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉపాధి శాఖ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. రాజకీయ రంగు పులిమి ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి పనులకు బాధ్యత లేకుండా చేశారు. నియోజకవర్గంలో ఏపీడీ విచారణతో బలవంతంగా ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించేశారు. రాజకీయ ఒత్తిళ్లు మితిమీరడంతో అధికారులు సైతం తల ఊపుతున్నారు. ప్రస్తుతం మేటీలతో పనులు నెట్టుకొస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు నియమించకపోయినా మేటీలకు ఆన్‌లైన్ ఎన్ఎంఎంఎస్ ఇవ్వడంపై విమర్శలు వ్యక్త మవుతున్నాయి. ఫీల్డ్ అసిస్టెంట్లు లేకుండా చేస్తున్న పనులపై రేపటి రోజు సామాజిక తనిఖీకి చేపడితే అందులో జరిగిన అవినీతికి ఎవరిని బాధ్యులను చేస్తారో ప్రభుత్వానికే ఎరుక.

తొమ్మిది వారాలుగా వేతనం రాలేదు



ఉపాధి పనులపైనే ఆధారపడుతున్నాం. ఎండాకాలంలో వ్యవసాయ పనులు లేవు. ఉపాధి పనులకు వస్తున్నా మాకు వేతనాలు వేయలేదు. 9 వారాలుగా కూలి పడలేదు. కుటుంబం గడవటం కష్టంగా మారింది. ప్రభుత్వం ఇప్పటికైనా కూలీలకు వేతనాలు మంజూరు చేయాలి.

– తిక్కమ్మ, సూగూరు

పనులకు రాకపోయినా వేతనాలు



మాది కౌతాళం మండలం గుడికంబాళి గ్రామం. మా గ్రామంలో కొందరు నాయకులు పనులకు రాకున్నా వారి బ్యాంకు ఖాతాలో ఉపాధి వేతనాలు జమవుతున్నాయి. పేదల పేరుతో ఉపాధి నిధులు స్వాహా చేస్తున్నారు. ఉపాధి పనులపై అధికారులు విచారణ చేపట్టాలి. స్వాహా చేసిన నిధులను వసూలు చేయాలి. – మారెప్ప, గుడికంబాళి

సబ్సిడీ విత్తనాలు ఇవ్వండి

కౌతాళం: ముందస్తు వర్షాలు కురుస్తుండటంతో మండలంలోని రైతులు విత్తుకోవడానికి సిద్ధంగా ఉన్నారని ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలను అందజేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఇంత వరకు సబ్సిడీ విత్తనాలు సరఫరా చేయకపోవడంతో బహిరంగ మార్కెట్‌లో రకరకాల కంపెనీల విత్తనాలను కొనుగోలు చేస్తున్నారన్నారు. ఇప్పటికే తెలంగాణ నుంచి కల్తీ విత్తనాలను వస్తున్నట్లు సమాచారం ఉందని వ్యవసాయ అధికారులు కఠిన చర్యలు తీసుకుని నకిలీ విత్తనాలను అరికట్టాలని కోరారు. పత్తి, కొర్రలు, సజ్జలు, జొన్న విత్తనాలు, ఎరువులను కూడా సబ్సిడీపై సరఫరా చేయాలన్నారు.

నియామకం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి పాలక వర్గాన్ని నియమిస్తూ కూటమి ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎక్స్–అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ ఈ మేరకు జీఓ ఆర్‌టీ నంబరు 368 జారీ చేశారు. గౌరవ చైర్మన్‌గా ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి నియమితులయ్యారు. చైర్మన్‌గా కురువ మల్లేష్, వైస్ చైర్మన్‌గా బోయ అంజని, సభ్యులుగా బండారి లక్ష్మి, బోయ ప్రభాకర్, బోయ రామచంద్రమ్మ, జే.అబ్రహం, గుర్రం కమ్మ కవిత, ఎం.దుబ్బన్న, కరణం సుదీర్, సూగూరు సాహిన్, తెలుగు శశికళ, బోయ వెంకటేశ్వరమ్మ, ఏ.ఫకృద్దీన్, కండె జయలక్ష్మి, కమ్మరి వెంకటేష్ ఆచారి నియమితులయ్యారు.

క్లుప్తంగా

ఆధార్ సెంటర్లపై చర్యలు తీసుకోండి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో విద్యార్థుల నుంచి అధిక నగదు వసూలు చేస్తున్న ఆధార్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రబాబు, పీడీఎస్ఓ జిల్లా ఉపాధ్యక్షుడు సురేంద్రబాబు, లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శేషఫణికి వినతి పత్రం ఇచ్చారు. ఆధార్ సెంటర్ల నిర్వాహకులు నిబంధనల మేరకు ఆధార్‌కు రూ.50 తీసుకోవాల్సి ఉండగా రూ.200లకు పైగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఆయా సెంటర్లను తనిఖీ చేసి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు


నెరుడుప్పలలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్

సాక్షి ఎఫెక్ట్

గోనెగండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో నెలకొరిగిన విద్యుత్ స్తంభాలకు అధికారులు మరమ్మతు చేయించారు. విరిగిన స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. దీంతో గ్రామాల్లో విద్యుత్ కోతలు తీవ్రమయ్యాయి. దీనిపై 'విరిగిన స్తంభాలు.. కరెంటు కోతలు' అనే కథనం ఇటీవల సాక్షి దినపత్రికలో వచ్చింది. దీనిపై స్పందించిన విద్యుత్ శాఖ ఏఈ, సిబ్బంది నెలకొరిగిన, విరిగిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు పనులు చేపట్టారు. శుక్రవారం ఏఈ సుధాకర్ రావు మాట్లాడుతూ.. మండలంలో ఉరుములు, మెరుపులు, గాలివానకు అక్కడక్కడ విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయని.. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయని తెలిపారు. వాటికి మరమ్మతు పనులు చేసినట్లు తెలిపారు.

అడ్మిషన్ ఫీజుల నియంత్రణకు వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

నందవరం: ప్రైవేట్ స్కూళ్లలో అడ్మిషన్ల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు విష్ణు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసులుకు ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. మండలంలో ప్రైవేట్ పాఠశాలలు అడ్మిషన్ల పేరుతో డొనేషన్లు వసూలు చేస్తున్నారని, ప్రభుత్వ నిబంధనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు కాశీం, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

చౌకదుకాణాల తనిఖీ

మంత్రాలయం రూరల్ : మండలంలోని పలు చౌకదుకాణాలను తహసీల్దార్ రవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం మండలంలోని చెట్నిహళ్లి, సూగూరు, కల్లుదేవకుంట, మంత్రాలయంలోని చౌకదుకాణాలను పరిశీలించారు. 1వ తేదీ నుంచి రేషన్ దుకాణాల నుంచే సరుకులు పంపిణీ చేయాల్సి ఉంది. దుకాణాల నిర్వహణ కోసం డీలర్లు తీసుకుంటున్న జాగ్రత్తలపై ఆరా తీశారు. అలాగే ప్రతి ఒక్కరూ ఈ–పాస్ మిషన్లు, కాటాలను అప్‌డేట్ చేసుకోవాలని ఆదేశించారు. రేషన్ పంపిణీ విషయంలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు.

కొనసాగుతున్న యోగా శిక్షణ

మంత్రాలయం రూరల్: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంత్రాలయం జెడ్పీ ఉన్నత పాఠశాలలో యోగా శిక్షణ కొనసాగుతోంది. ప్రోగ్రాం స్పెషల్ ఆఫీసర్ ఏపీవో భక్తవత్సలం, నోడల్ ఆఫీసర్ మహతి నేతృత్వంలో శిక్షణ గావిస్తున్నారు. అలాగే ఉదయం పుర వీధుల్లో యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

కోసిగి: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి యోగాపై ప్రజలకు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు యోగాపై శిక్షణ ఇవ్వాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ ఆదోని పట్టణ అధ్యక్షుడిగా దేవా


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, చిత్రంలో దేవ

ఆదోని టౌన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదోని పట్టణ అధ్యక్షుడిగా దేవాను నాలుగోసారి ఎంపిక చేస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన తన నివాసంలో దేవాతో కలిసి విలేకరుతో మాట్లాడారు. అనంతరం దేవా మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు, మున్సిపల్ మాజీ చైర్మన్ దేవదాస్, పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు వైపీ గంగాధర్, యూత్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు నల్లారెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బుట్టా రేణుక

ఎమ్మిగనూరుటౌన్: నందవరం మండలం హలహర్వి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు లక్ష్మారి కృష్ణ కుమారుడు శుక్రవారం రోటవేటర్ కింద పడి గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక ఎమ్మిగనూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని పరామర్శి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆమె వెంట పార్టీ నాయకులు బుట్టా శివనీలకంఠ, హలహర్వి మాజీ సర్పంచ్ కేఆర్ రామకోటేశ్వర్‌రెడ్డి, నందవరం మండల కన్వీనర్ శివప్ప గౌడ్, విరుపాక్షిరెడ్డి, బోయబజారి ఉన్నారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

గోనెగండ్ల: వర్షాకాలంలో వచ్చే మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడువాపు తదితర వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంచార చికిత్స కార్యక్రమం నోడల్ అధికారి డాక్టర్ రఘు తెలిపారు. శుక్రవారం గోనెగండ్లలోని శ్రీరామ్ నగర్ కాలనీలో ఫ్రై డే డ్రైడే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఇళ్ల పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని, డ్రమ్ములను పరిశీలించారు. ఇంటి పరిసరాల్లోని నీటి నిలువల్లో దోమలు పెరుగుతాయని తెలిపారు. పాత వస్తువులు, పూల కుండీలు, కూలర్లు, టైర్లు, తాగి పడేసిన కొబ్బరి బోండాలు, రుబ్బు రోళ్లలో ఉన్న నీటి నిల్వల్లో దోమలు పెరిగి మలేరియా వ్యాధులు వ్యాప్తి చేస్తాయని తెలిపారు. వారానికి ఒకసారి నీటిని తొలగించి వాడుకోవాలని సూచించారు.

సక్రమంగా రేషన్ సరుకులు పంపిణీ చేయాలి

ఎమ్మిగనూరురూరల్: రేషన్ కార్డుదారులకు నిత్యవసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ శేషఫణి డీలర్లను ఆదేశించారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి రేషన్ దుకాణాల్లోనే కార్డుదారులకు బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. డీలర్లు ప్రతి కార్డుదారునికి నిత్యావసర సరుకులు అందేలా చూడాలని తెలిపారు. కార్డుదారుకుల ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని సూచించారు. 1వ తేదీ ఉదయం 8 గంటల కల్లా రేషన్ షాప్‌ను తెరుచుకుని ఉండాలని పేర్కొన్నారు. డిప్యూటీ తహసీల్దార్ వీరేంద్రగౌడ్ పాల్గొన్నారు.

వల్లూరులో డీఎస్పీ విచారణ


గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

కౌతాళం: మండలంలోని వల్లూరు గ్రామంలో ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు శుక్రవారం విచారణ చేపట్టారు. గురువారం ఏడేళ్ల చిన్నారిపై అదే గ్రామానికి చెందిన యువకుడు అత్యాచారం చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసింది. ఈ కేసు విచారణ నిమిత్తం డీఎస్పీ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను విచారించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. చిన్నారిపై అత్యాచారం జరగడంతో యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయడంతో గ్రామంలో విచారించామని ఆయన తెలిపారు. త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామని చెప్పారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించిన పలు సూచనలు చేశారు. మంత్రాలయం సీఐ రామాంజులు, కౌతాళం హెడ్‌కానిస్టేబుల్ సోమ్లానాయక్ ఉన్నారు.

ఏడాదైనా హామీల అమలేది..?


సమావేశంలో మాట్లాడుతున్న బుట్టా రేణుక


హాజరైన పార్టీ నాయకులు

- జూన్ 4న వెన్నుపోటు దినంగా పాటించాలి
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక

ఎమ్మిగనూరుటౌన్: అధికారం చేపట్టి ఏడాది అవుతున్నా కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని.. అందుకే వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపు మేరకు జూన్ 4వ తేదీ వెన్నుపోటు దినంగా పాటించాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక అన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయ ఆవరణలో నియోజకవర్గంలోని పార్టీ నాయకులతో సమావేశంనిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి ఏడాది గడిచినా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీలు ఏడాదిలో అమలు చేసిన ఘనత మాజీ సీఎం జగనన్నకే దక్కిందన్నారు. కూటమి ప్రభుత్వాన్ని తమ పార్టీ నిలదీసేందుకు సిద్ధమైందన్నారు. ఇందుకు ప్రజలు కూడా మద్దతు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. జూన్ 4న నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు స్థానిక కార్యాలయానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వాన్ని నిలదీసేందుకు వెన్నుపోటు దినం కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు రావాలని కోరారు. సమావేశంలో ఆ పార్టీ వీరశైవలింగాయత్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రగౌడ్, పార్టీ రాష్ట్ర మేధావుల ఫోరం కన్వీనర్ లక్ష్మికాంతరెడ్డి, మున్సిపల్ చైర్మన్ కెఎస్ రఘు, ఎంపీపీ కేశన్న, నాయకులు విరుపాక్షిరెడ్డి, కేవీ కృష్ణారెడ్డి, బుట్టా శివనీలకంఠ, మాచాని వెంకటేష్, సోగనూరు భీమిరెడ్డి, సునీల్‌కుమార్, నజీర్‌అహమ్మద్, ఎంకే శివప్రసాద్, రాజశేఖర్, బందెనవాజ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలి

పెద్దకడబూరు : అర్హులైన పేదలందరికీ ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్‌యాదవ్, మండల కార్యదర్శి వీరేష్, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయ డిమాండ్ చేశారు. జూన్ 2న మండల తహసీల్దారు కార్యాలయాల ఎదుట చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలంటూ పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం మేరకు పట్టణ ప్రాంతాల్లో 2సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3సెంట్లు స్థలాలు ఇచ్చి, ఇళ్ల నిర్మాణం కోసం రూ. 5లక్షలు ఇవ్వాలన్నారు. సూపర్ – 6 హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. బాబు, హసన్, చిన్నోడు, నరసింహులు, నబిరసూల్, చాంద్‌బాషా పాల్గొన్నారు.

యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు పూర్తి చేయండి

నందవరం: జూన్ 21వ తేదీ నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమానికి రిజిస్ట్రేషన్లు త్వరగా పూర్తి చేయాలని సచివాలయ సిబ్బంది, అధికారులకు ఎంపీడీఓ పుల్లయ్య ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు తక్కువగా ఉన్నాయని, క్రీడకారులు, యువతి, యువకులును నమోదు చేయాలన్నారు. జూన్ 21న చేపట్టే మోగా యోగా కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. అందుకు అందరూ సహకారించాలని పేర్కొన్నారు.

పోషకాహారంతో రక్తహీనత నివారణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా సంచార చికిత్స ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్

ఎమ్మిగనూరుటౌన్: పోషకాహారం తీసుకుంటే గర్భిణుల్లో రక్తహీనత నివారించవచ్చని జిల్లా సంచార చికిత్స ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఖిబులా కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం జాతీయ కౌమార ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా రక్తహీనతపై తీసుకోవాల్సిన జాగ్రతలపై పోస్టర్లను స్థానిక వైద్యులు, సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. గర్భం దాల్చిన మహిళ మూడో నెల నుంచి పోషకాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వడం జరుగుతుందని తెలిపారు. రక్తహీనత ఉంటే ప్రసవం కష్టంగా మారుతుందని పేర్కొన్నారు. శారీరక లోపం కలిగిన పిల్లలు పుట్టే అవకాశం ఉంటుందన్నారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే పోషకారంతో కూడిన సమతుల ఆహారం తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆస్పత్రి వైద్యాధికారిణి సాయి జాహ్నవి, ఆరోగ్య విస్తరణ అధికారి విజయకృష్ణ, ఖలీల్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు దుర్మరణం


బి. రాముడు (ఫైల్)


మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

మంత్రాలయం రూరల్ : రెండు మోటార్ సైకిళ్లు ఢీకొన్న ఘటనలో ఓ రైతు దుర్మరణం చెందారు. వివరాలు..మండలంలోని చెట్నిహళ్లి గ్రామానికి చెందిన కురువ రాముడు (60) పొలం పనులకు వెళ్లి మధ్యాహ్నం 12.45 గంటల సమయంలో మనవడితో కలిసి బైక్‌పై ఇంటికి బయలు దేరాడు. పొలం రస్తా నుంచి జాతీయ రహదారిపైకి వస్తుండగా మంత్రాలయం నుంచి బైక్‌పై వేగంగా వస్తున్న పాండురంగ, జొల్లు రఘు ఢీకొట్టారు. దీంతో రాముడు తలకు బలమైన గాయమై అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. విషయం తెలుసుకున్న భార్య లక్ష్మి, కుమారులు మల్లారెడ్డి, మోలార్‌లింగ సంఘటన స్థలానికి చేరుకుని ఇంటి పెద్ద దిక్కు విగతజీవిగా పడిఉండటాన్ని చూసి బోరున విలపించారు. అలాగే మంత్రాలయం నుంచి వస్తున్న రాంపురం గ్రామానికి చెందిన పాండురంగ తలకు గాయమైంది. ఆదోనికి చెందిన జొల్లు రఘు స్వల్పంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను ఎమ్మినూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హెడ్ కానిస్టేబుల్ నారాయణ సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతుడి పెద్ద కుమారుడు మల్లారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని పోలీసులు తెలిపారు. మృతదేహానికి ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి. భీమారెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

రసాభాసగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

- హిందూ శ్మశాన వాటికలో అక్రమ రోడ్డు నిర్మాణంపై రభస
- కౌన్సిల్ హాల్‌లో చొచ్చుకొచ్చిన హిందూ సంఘాల నాయకులు
- పోలీసుల రంగప్రవేశం
- కౌన్సిల్ హాల్ ముందు బైఠాయింపు


కౌన్సిల్ సభ్యులను సముదాయిస్తున్న చైర్మన్ కేఎస్ రఘు


హిందూ సంఘాల నాయకులను బలవంతంగా బయటకు పంపిస్తున్న పోలీసులు

ఎమ్మిగనూరుటౌన్: హిందూశ్మశాన వాటిక స్థలంలో ఓ వ్యక్తి తన ప్లాట్ల కోసం 30 అడుగుల రోడ్డును అక్రమంగా నిర్మించడంపై వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిల్ సభ్యుల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలతో శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ సాధరణ సమావేశం రసాభాసగా మారింది. చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు అధ్యక్షతన సమావేశం జరిగింది. ప్రారంభమైన పది నిమిషాలకే కౌన్సిల్ అజెండాలోని 34 అంశాలతో పాటు టేబుల్ అజెండాను ఆమోదిస్తున్నట్లు వైస్ చైర్మన్ నజీర్‌అహ్మద్ పేర్కొనడంతో సభ్యులు సమ్మతి తెలిపారు. ఆ వెంటనే పట్టణంలోని 22 హిందూ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీగా వచ్చి మున్సిపల్ కార్యాలయం ముందు బైఠాయించి అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కౌన్సిల్ సమావేశ భవనంలోకి చొచ్చుకొచ్చి న్యాయం చేయాలంటూ నినాదాలు చేయడంతో కౌన్సిల్ హాల్ రచ్చరచ్చగా మారింది. వారిని సభ్యులతో పాటు చైర్మన్, అధికారులు వారించినా వినలేదు. చైర్మన్‌కు వినతి పత్రం ఇచ్చి న్యాయం చేయాలంటూ నినదించారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి వారిని బలవంతంగా కౌన్సిల్ హాల్ నుంచి బయటికి పంపించారు. అనంతరం వైస్ చైర్మన్ మాట్లాడుతూ.. గతంలో 17వ వార్డు ప్రజలకు రోడ్డు సమస్య ఉందని అధికారులకు విన్నవిస్తే రోడ్డు నిర్మాణానికి కౌన్సిలర్లంతా ఏకగ్రీవంగా తీర్మానించినట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం 22 కుల సంఘాల నాయకులు శ్మశాన వాటికలో రోడ్డు నిర్మాణం అక్రమమని చెప్పడంతో దానిపై తమ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక సైతం కులసంఘాలకు న్యాయం చేయాలని చెప్పారని వివరించారు. దీంతో టీడీపీ ఫ్లోర్ లీడర్ దయాసాగర్ రోడ్డు నిర్మాణం వైఎస్సార్‌సీపీ హయాంలో తీర్మాణం చేశారని, ఆ రోడ్డు అనుమతికి లక్షల్లో డబ్బు తీసుకొన్నారని ఆరోపించడంతో వైఎస్సార్‌సీపీ సభ్యులు అభ్యంతరం తెలిపారు. డబ్బులు ఎవరు తీసుకున్నారో నిరూపించాలని.. నాడు తీర్మాణం చేసినప్పుడు అజెండా కాపీలోని అంశాల తీర్మాణానికి టీడీపీ సభ్యులు కూడా సమ్మతించారు కదా.. ఇప్పుడు తమపై నిందమోపడం ఎంతవరకు సమంజసమని వైఎస్ చైర్మన్ నజీర్ ఘాటుగా సమాధానం ఇచ్చారు. దీనిపై కమిటీ వేసి చర్చించి సమస్య పరిష్కరించాలని సూచించారు. ఈ సమస్యపై కమిషనర్ గంగిరెడ్డి సమాధానం ఇస్తూ.. నాడు ప్రజల విన్నపం మేరకు రోడ్డుకు అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు. కోర్టు పరిధిలో ఉన్నందున కోర్టు ఆదేశాల మేరకు తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఆయా వార్డుల్లోని సమస్యలను కౌన్సిలర్లు బజారి, డిష్ కేశవరెడ్డి, శివప్రసాద్, అంపమ్మ చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో డీఈలు రాజునాయక్, నీరజ, విక్టర్, టీపీఓ రాజేష్, ఆర్ఓ అస్లాంబాషా పాల్గొన్నారు.


మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి నినాదాలు చేస్తున్న సంఘాల నాయకులు

దేశ సమైక్యతను కాపాడుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: దేశ సమైఖ్యత, సమగ్రత, లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు గోవిందు, సత్యన్న, రాజు, రాముడు అన్నారు. శుక్రవారం పట్టణంలో సమైక్యతా యాత్ర నిర్వహించారు. ఉగ్రవాదాన్ని పూర్తిగా అణచివేయకుండా అగ్రరాజ్యం అమెరికా జోక్యంతో ఉగ్రవాదంపై పోరు నిలిపివేయడం శోచనీయమన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు
97054 44304 (ఆదోని)
70750 09147 (ఎమ్మిగనూరు, మంత్రాలయం)
Office mail : sakshiknladvt@gmail.com